క్లుప్తంగా

సత్యనగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పాటు



నూతన కమిటీ సభ్యులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ సత్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పాటైంది. నూతన అధ్యక్షుడిగా ఓవీఆర్ కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎస్.రాజగోపాల్, కార్యదర్శిగా బాలకృష్ణ, కోశాధికారిగా ఎం. కర్ణకుమార్, జాయింట్ సెక్రటరీగా ఎ.మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా శ్యామ్‌గౌడ్, ఎస్.గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాలనీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నూతన కమిటీ పాటుపడుతుందని నూతన అధ్యక్షుడు ఓవీఆర్ కుమార్ తెలిపారు.

మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం అందజేత



లింగోజిగూడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు అన్ని విధాలా అండగా ఉండి ఆదుకుంటుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. 2019లో ఆంధ్రప్రదేశ్‌లోని కచ్చులూరు జరిగిన పడవ ప్రమాదంలో హయత్‌నగర్‌కు చెందిన విశాల్, భరణికుమార్‌లు నీట మునిగి చనిపోగా, అర్జున్, చరణ్‌లను స్థానికులు కాపాడిన విషయం విదితమే. ఈ ఘటన జరిగినప్పుడు మృతుల కుటుంబ సభ్యులను అన్ని విధాలా ఆదుకుంటానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. తర్వాత ఆయన సీఎంను కలిసి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. దీంతో ప్రభుత్వం వారికి రూ.5 లక్షలు మంజూరు చేయగా, ఇందుకు సంబంధించిన చెక్కులను మంగళవారం సుధీర్‌రెడ్డి విశాల్ తండ్రి బాబూరావు, భరణికుమార్ తండ్రి రాజుకు అందజేశారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

సైదాబాద్: సాఫీగా ప్రయాణాలు సాగించేందుకు అందరూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకోవడం అవసరమని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జీ.శంకర్‌రాజు సూచించారు. ఐఎస్‌సదన్ చౌరస్తాలోని ధృవ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ట్రాఫిక్ రూల్స్ అవగాహన సదస్సులో ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సురక్షిత ప్రయాణల కోసం అందరూ ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి సహకరిస్తూ వారి ఆదేశాలు పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇతర వాహనాలకు ఆటంకం కలిగించకుండా వాహనాలను నడపాలన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాదిగల అభివృద్ధి సాధ్యం

మలక్‌పేట: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం మూసారంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలోని పార్కులో జరిగింది. సమావేశానికి హాజరైన ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మైలపాక రాంచందర్ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టుపాక ప్రభాకర్‌మాదిగ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ, మాదిగ ఉపకులాలు అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొయ్యడ వెంకటస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పోలేపాక వెంకన్న, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా జోగు సైదులు, ప్రధాన కార్యదర్శిగా జంగిడి కుమార్ నియమితులయ్యారు.

కేలండర్ ఆవిష్కరణ

నాగోలు: మన రజక సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా రూపొందించిన కేలండర్‌ను మంగళవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కాలియా పైల్వాన్, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి గోవింద్ మల్లేష్, ఉపాధ్యక్షుడు చందు, వర్కింగ్ ప్రెసిడెంట్ పగడాల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రంక్‌లైన్‌తో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం

మన్సూరాబాద్: హతిగూడ చెరువు కాలువ పక్క నుంచి డ్రైనేజీ ట్రంక్‌లైన్ ఏర్పాటుతో డ్రైనేజీ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పష్టంచేశారు. డివిజన్‌లోని హయత్‌నగర్ పరిధిలో గల సిరిహిల్స్, స్వాతి రెసిడెన్సీ, అంజలి రెసిడెన్సీ, లక్ష్మీభవానీనగర్, కేవీఎస్‌రెడ్డినగర్, ఎల్లారెడ్డికాలనీ ఫేజ్–2, ఆదర్శ్‌నగర్, శ్రీరామ్‌నగర్, లక్ష్మీప్రసన్నకాలనీలలో జలమండలి ఏఈ రాజుతో కలిసి మంగళవారం పర్యటించి డ్రైనేజీ లెవల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, శివారు ప్రాంతంలోని కాలనీలలో డ్రైనేజీ లెవల్స్ కలువక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. హతిగూడ చెరువు కట్ట నుంచి కుంట్లూరు గ్రామం బుడద నాలా వరకు లెవల్స్‌ను పరిశీలించినట్లు తెలిపారు.

బాక్స్ డ్రెయిన్ పనుల్లో 'రక్షణ నిల్'

- అసంపూర్తిగా పనులు
- గుంతల వల్ల ఇంటి నుంచి బయట అడుగుపెట్టలేని పరిస్థితి
- రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్



గ్రీన్ పార్క్ కాలనీలో బాక్స్ డ్రెయిన్ పనులు జరుగుతున్న ప్రాంతంలో ఆడుకుంటున్న బాలుడు

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో జరుగుతున్న బాక్స్ డ్రెయిన్ పనుల్లో కాంట్రాక్టర్ తగిన రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఎస్ఎన్‌డీపీ అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ కొరవడంతోనే కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నాడని, డ్రెయిన్ నిర్మాణం కోసం తవ్విన గుంతల వద్ద బారికేడ్ల ఏర్పాటు వంటి కనీస రక్షణ చర్యలు చేపట్టలేదని స్థానికులు పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- గ్రీన్ పార్క్ కాలనీలో సుమారు 9 నెలల క్రితం బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులను ప్రారంభించారు.
- కాంట్రాక్టర్ పనుల చేపట్టడంలో నిర్లక్ష్యం చేయడం వల్ల ఇప్పటి వరకు సగం పనులు కూడా పూర్తి కాలేదు.



శ్రీనివాస్ కాలనీలో జరుగుతున్న బాక్స్ డ్రెయిన్ పనులు

- డ్రెయిన్ నిర్మాణం కోసం ఇళ్ల ముందు భారీ గుంతలను తీసి అలాగే వదిలేయడంతో తమ ఇళ్ల నుంచి బయటకు వెళ్ళే సమయంలో ప్రమాదాలకు గురవుతామోనని భయమేస్తోందని స్థానికులు వాపోతున్నారు.
- అలాగే శ్రీనివాస కాలనీలో తవ్విన గుంతలతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- బియ్యం ఎగుమతి, దిగుమతుల కోసం నిత్యం ఇక్కడికి పదుల సంఖ్యలో భారీ వాహనాలు వస్తుంటాయి. బాక్స్ డ్రెయిన్ కోసం గుంతలు తీసి వదిలేయడంతో ఆ రోడ్డులో భారీ వాహనాలు వచ్చే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో తమ వ్యాపారాలు సరిగా సాగడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే పూర్తి చేయాలి

- గ్రీన్ పార్క్ కాలనీ రోడ్డు నెం 17 వద్ద బాక్స్ డ్రెయిన్ పనులు జరుగుతున్న ప్రాంతంలో ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో మతిస్థిమితం లేని బాలుడు గుంతలో పడిపోయాడని స్థానికులు తెలిపారు. వెంటనే బాలుడిని గుంతలోంచి బయటకు తీయడంతో త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాడన్నారు. బాక్స్ డ్రెయిన్ పనులు జరుగుతున్న ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు రక్షణ చర్యలు చేపట్టాలని, పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బయటకు రాలేని పరిస్థితి ఉంది

బాక్స్ డ్రెయిన్ పనుల కారణంగా ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. స్కూల్‌కు పెద్దల సాయంతో జాగ్రత్తగా నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. ఎలాంటి ప్రమాదం జరగక ముందే రక్షణ చర్యలు తీసుకోవాలి.

– సాయి, విద్యార్థి

రక్షణ చర్యలు చేపడుతున్నాం

బాక్స్ డ్రెయిన్ పనులు జరుగుతున్న ప్రతిచోటా రక్షణ చర్యలు చేపట్టాం. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశాం. అయితే, రాకపోకలకు ఇబ్బందిగా ఉందని పలుచోట్ల స్థానికులే బారికేడ్లు తీసేస్తున్నారు. ఎక్కడైనా లేకపోతే బారికేడ్లు ఏర్పాటు వంటి రక్షణ చర్యలు తీసుకుంటాం.

– సతీష్, ఎస్ఎన్‌డీపీ ఏఈ

పేదల కడుపు కొడుతున్న టీఆర్‌ఎస్ ప్రభుత్వం: మల్‌రెడ్డి

చైతన్యపురి: సంక్రాంతి పండుగ సమయంలో కూడా ఇంకా పేదలకు రేషన్ ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి విమర్శించారు. చైతన్యపురిలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పలు డివిజన్ల నాయకులు, కార్యకర్తలతో ప్రజా సమస్యలపై సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పెద్ద పండుగ సమీపిస్తున్నా రేషన్ బియ్యం ఇంతవరకు ఇవ్వలేదన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమయంలో 9 రకాల నిత్యావసరాలు ఇవ్వగా, టీఆర్‌ఎస్ ప్రభుత్వం బియ్యం మాత్రమే ఇస్తోందని విమర్శించారు. జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, గుర్రం శ్రీనివాసరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, నర్సింహయాదవ్, శ్యాంచరణ్‌రెడ్డి, స్వర్ణ, మాధవి, సౌమ్యారెడ్డి, కవిత, సంగీత, సరిత పాల్గొన్నారు.



సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలి



సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎల్‌బీనగర్: బెంగళూర్‌లో ఈ నెల 18 నుంచి 22 తేదీ వరకు నిర్వహించే సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ ఎల్‌బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎలయ్య పిలుపునిచ్చారు. మహాసభలను విజయవంతం చేయాలని వనస్థలిపురం లేబర్ అడ్డా వద్ద సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎల్లయ్య మాట్లాడుతూ, నరేంద్ర మోదీ తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలపై రాజీలేని పోరాటం చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం భారత సంపదను కార్పొరేటర్ శక్తులకు కట్టబెడుతున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, మహేశ్, నరసింహ, సామేలు, రవి, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

'కేంబ్రిడ్జ్'లో సంక్రాంతి సంబురాలు



రంగవల్లులు తీర్చిదిద్దిన కేంబ్రిడ్జ్ విద్యార్థినులు

సైదాబాద్: దేశ సంస్కృతి సాంప్రదాయాలకు చిహ్నమైన పండుగల గురించి చిన్ననాటి నుంచే విద్యార్థులకు వివరించాలని కేంబ్రిడ్జ్ విద్యాసంస్థల అధిపతి కె.శంతన్‌కుమార్ అన్నారు. మంగళవారం సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్ కాలనీలోని కేంబ్రిడ్జ్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో బాలురకు పతంగుల తయారీ, బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తాము తయారు చేసిన పతంగులను ఎగురవేసి సందడి చేశారు. బాలికలు అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఝాన్సీ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యానికి మేలు

మలక్‌పేట: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం చిరుధాన్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోజువారీ జీవితంలో మిల్లెట్‌లను ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలు విద్యార్థులకు వివరించారు. డాక్టర్ వాణి మాట్లాడుతూ.. ఆరోగ్యానికి మేలు చేయని మైదా, ఇతర ఉత్పత్తులకు బదులు చిరుధాన్యాలు వాడేలా తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు శివప్రసాద్, శ్రీనివాస్, లత, వనజ, ఇన్‌చార్జి హెచ్ఎం నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విన్నర్స్‌కు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్

దిల్‌సుఖ్‌నగర్: ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్ న్యాయ కళాశాలల క్రికెట్ టోర్నమెంట్‌లో ఆర్కేపురం డివిజన్‌లోని మహాత్మాగాంధీ న్యాయ కళాశాల విద్యార్థులు విన్నర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా మంగళవారం మహాత్మాగాంధీ న్యాయ కళాశాలలో ఏర్పాటు సమావేశంలో క్రికెట్ టోర్నీలో గెలుపొందిన విద్యార్థులను కళాశాల చైర్మన్ గంగుల గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్,అధ్యాపకులు అభినందించారు. క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా మహమ్మద్ అరనాన్, వైస్ కెప్టెన్‌గా షాబాద్ రూపేష్ వ్యవహరించారు. కార్యక్రమంలో టీమ్ సభ్యులు సురేష్, శ్రీకాంత్, అక్షయ్, కల్యాణ్, హేమచంద్ర, సంపత్, శ్రీనివాస్, ఉమా మహేశ్వర్, నవీన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఎల్‌బీనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తున్న త్వరగా పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో హరిహరిపురం కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు, ఎన్‌జీఓఎస్ కాలనీలో జరుగుతున్న ఉమెన్స్ థీమ్ పార్కు పనులను మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ఈ అశోక్‌రెడ్డి, ఈఈ రమేష్‌బాబు, ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి నాయకులు శంకరయ్యగౌడ్, నరసింహరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్యా.. పిల్లి దొరికింది!



హస్తినాపురం: వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైన అరుదైన పెంపుడు పిల్లిని మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించామని సీఐ కె.సత్యనారాయణ తెలిపారు. రెండురోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లిన పిల్లి కనిపించకపోవడంతో చింతలకుంట జహంగీర్‌నగర్ కాలనీకి చెందిన అజహర్ అహ్మద్ అనే వ్యక్తి సోమవారం వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ పిల్లి సుమారు రూ. 50 వేల విలువ ఉంటుందని , గతేడాది నుంచి కంటికి రెప్పలా చూసుకుంటున్నానని అతను ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా చుట్టుపక్కల కాలనీల్లో తనిఖీలు చేయగా జహంగీర్‌నగర్ కాలనీకి పక్కనే ఉన్న శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన సోను అనే అబ్బాయికి ఈ అరుదైన పిల్లి దొరికిందని తెలిసింది, దానిని స్వాధీనం చేసుకొని బాధితుడికి అప్పగించినట్లు సీఐ సత్యనారాయణ వెల్లడించారు.

వ్యక్తి అదృశ్యం



సుధాకర్

హస్తినాపురం: ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని హస్తినాపురం నాగార్జున కాలనీలో నివసిస్తున్న మొలుగు సుధాకర్(47) బీఎన్‌రెడ్డినగర్‌లోని సెలూన్‌లో పని చేస్తున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సుధాకర్ గత నెల 28న డబ్బుల కోసం నల్లకుంటలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కంగారుపడ్డ కుటుంబసభ్యులు సుధాకర్ ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుధాకర్ భార్య అరుణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాతృశ్రీ కళాశాలలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



సాక్షి,సిటీబ్యూరో: సైదాబాద్‌లోని మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే జరిగింది. నోవాటో ఫీస్టా 2కే 23 పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ చైర్మన్ కేపీ శ్రీనివాసరావు, సెక్రటరీ కృష్ణకుమార్, ట్రెజరర్ జె.సుధాకర్, ప్రిన్సిపాల్ డి.హనుమంతరావు, టి.శేఖరన్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ర్యాంప్ వాక్, ఇతర నృత్యరూపకాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



కార్యక్రమంలో పాల్గొన్న కమలా సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: సంక్రాంతి పండుగ సందర్భంగా వనస్థలిపురం ప్రశాంత్‌నగర్ కాలనీలో మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు జయ చంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ దేవిరెడ్డి కమలా సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు పురుషులకు ధీటుగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఈశ్వరమ్మ యాదవ్, మహిళా మండలి అధ్యక్షురాలు బి.లక్ష్మీరెడ్డి, ఉపాధ్యక్షురాలు బి.సుకృత, కార్యదర్శి జె.వాణి, సంయుక్త కార్యదర్శి ఎల్.చంద్రకుమారి, కోశాధికారి పి.అరుణకుమారి, కార్యవర్గసభ్యులు అరుణ, రజని, రాజకుమారి, జయలక్ష్మి, మధుమతి, వాణి పాల్గొన్నారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జాగ్రత్త!

హస్తినాపురం: సంక్రాంతి పండుగకు ఊరు వెళ్లేవారు ఇంటికి తాళాలు వేసి విలువైన వస్తువులను ఇంట్లో ఉంచుకోకుండా వెంట తీసుకెళ్లాలని భూపేశ్ గుప్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్‌కాలనీలోని నల్లపోచమ్మ ఆలయ ఆవరణలో మీర్‌పేట పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సులో శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ, కాలనీలలో ఎక్కువగా దొంగతనాలు జరుగుతున్నాయని, అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఊరికెళ్లేవారు తమ విలువైన బంగారు ఆభరణాలు, నగదును బ్యాంకుల్లో దాచుకోవాలని, ఇంటికి తాళం వేసివెళ్లేవారు పోలీసులకు సమాచారం అందించినట్‌లైతే గస్తీ నిర్వహిస్తారని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.

ఎమ్మెల్యే, కార్పొరేటర్ల అండతోనే గుడిసెల కూల్చివేత

- కాదని నిరూపిస్తే క్షమాపణ చెప్తా
- తెలంగాణ సీపీఐ కార్యదర్శి కూనంనేని



పునరావాస కేంద్రంలోని గుడిసెవాసులను పరామర్శిస్తున్న కూనంనేని సాంబశివరావు

సైదాబాద్: డివిజన్ పరిధిలోని లోకాయుక్త కాలనీలో 50 ఏళ్లుగా నివసిస్తున్న గిరిజనుల గుడిసెలను స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ల అండతోనే భూబకాసురులు కూల్చివేయించారని సీపీఐ తెలంగాణ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. వారు తన ఆరోపణలు అవాస్తవమని నిరూపించి, గుడిసెవాసులకు న్యాయం చేస్తే తాను వారికి క్షమాపణ చెబుతానని ఆయన స్పష్టం చేశారు. ఎస్‌బీహెచ్ సీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న గుడిసెవాసులను మంగళవారం ఆయన సీపీఐ నాయకులతో కలిసి పరామర్శించారు. రూ. 100కోట్ల విలువైన వెయ్యి గజాల స్థలాన్ని కబ్జాదారులకు అప్పగించేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. గిరిజనులకు రేషన్‌కార్డు, ఓటరుకార్డు, ఆధార్‌కార్డు, విద్యుత్ మీటర్లు, ఇంటి నంబర్లు.. ఇలా ప్రభుత్వం నుంచి అన్ని గుర్తింపులు ఉన్నా... ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వారి గుడిసెలను రెవెన్యూ అధికారులు, పోలీసులు తెల్లవారుజామున తొలగించడం అన్యాయమన్నారు. గుడిసెవాసులకు తిరిగి అక్కడే స్థలాలు కేటాయించే వరకు వారికి అండగా సీపీఐ తరుపున పోరాటం చేస్తామన్నారు. బాధితులను పరామర్శించిన వారిలో సీపీఐ నాయకులు ఈటీ నరసింహ, శంకర్‌నాయక్, షేక్ మహమూద్ ఉన్నారు.

పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణానికి చర్యలు

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వాణీనగర్ కాలనీలోని పార్కు ప్రహరీ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్‌లోని అన్ని పార్కుల్లో పచ్చదనం పెంచి, చిన్నారులు ఆడుకునేందుకు సౌకర్యాలు కల్పించేందుకు అధికారులతో చర్చిస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, విశాల్‌గౌడ్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: ట్రాఫిక్ డీసీపీ

నాగోలు: వాహనాల నంబర్ ప్లేట్ సక్రమంగా లేని, ట్యాంపరింగ్ నంబర్లతో, రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాచకొండ ట్రాఫిక్ డీసీపీ డి. శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశాల మేరకు ఈ నెల 2 వ తేదీ నుంచి 9 వరకు స్నాచింగ్‌లు, రోడ్డు ప్రమాదాలు, ఇతర నేరాలను తగ్గించేందుకు రాచకొండ పరిధిలో వివిధ ప్రాంతాలల్లో వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. ఇందులో రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ లేకుండా, ట్యాంపరింగ్ చేసిన, సక్రమంగా నంబర్ లేని 2925 వాహనాలపై కేసులు బుక్ చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పత్రాలను చూపించిన తర్వాత నంబర్ ప్లేట్లను సరి చేసి వాహనాలను తిరిగి ఇచ్చామన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై 27,467 కేసులు, పెట్టీ కేసులు 509, వెహికల్ లిఫ్టింగ్ 264, సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు 87, ట్రిపుల్ రైడింగ్ కేసులు 441 బుక్ చేసినట్లు తెలిపారు.

త్వరలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్.

ఫుట్‌పాత్ ఆక్రమణదారులు, వ్యాపార సంస్థలు తమ దుకాణాల ముందు ఉన్న రోడ్‌ను ఆక్రమించి ట్రాఫిక్ రద్దీని సృష్టిస్తున్నందుకు రాచకొండ ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికే 28 మందికి నోటీసులు జారీ చేశారన్నారు. రాచకొండ ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్ ఆక్రమణలపై 105 స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి 41 టోయింగ్ కేసులు, 509 ఆక్రమణ కేసులు బుక్ చేశారన్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలపై త్వరలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కేసులు బుక్ చేస్తామన్నారు. సమావేశంలో ఎల్‌బీనగర్, మల్కాజిగిరి, భువనగిరి ట్రాఫిక్ ఏసీపీలు అంజయ్య, శ్రీనివాస్‌రావు, సైదులు, ఎల్‌బీనగర్ ట్రాఫిక్ సీఐలు వెంకటేశ్వర్లు, మహేష్, అంజపల్లి నాగమల్లు పాల్గొన్నారు.

కారుతో ఢీకొట్టి.. ఆపై దాడి

- కార్పొరేటర్ భర్తపై బాధితుడి ఫిర్యాదు
- సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు
- తమను దుర్భాషలాడాడని కార్పొరేటర్ భర్త ఫిర్యాదు
- ఇరువురిపై కేసు నమోదు చేసిన పోలీసులు



కారుతో ఢీకొట్టినట్టు సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యం



గాయపడిన బాలరామకృష్ణ

మీర్‌పేట: బైక్‌పై వెళ్తున్న వారిని కార్పొరేటర్ భర్త కారుతో ఢీకొట్టి ఆపై దాడి చేసిన ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మీర్‌పేట 28వ డివిజన్ కార్పొరేటర్ జిల్లెల అరుణ భర్త ప్రభాకర్‌రెడ్డి సోమవారం రాత్రి కారులో ఇంటికి బయలుదేరాడు. అదే సమయంలో న్యూ బాలాజీనగర్‌కు చెందిన బలరామకృష్ణ మీర్‌పేట చౌరస్తా నుంచి డానియల్ అనే వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. శివసాయినగర్ కాలనీ పార్కు వద్దకు రాగానే ప్రభాకర్‌రెడ్డి తన కారుతో బలరామకృష్ణ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. బైక్‌పై ఉన్న ఇద్దరూ కిందపడ్డారు. దీంతో బలరామకృష్ణ, ప్రభాకర్‌రెడ్డిల మధ్య వాగ్వాదం జరిగింది. బలరామకృష్ణపై ప్రభాకర్‌రెడ్డి దాడి చేయడంతో స్వల్ప గాయాలయ్యాయి. తనపై దాడి చేసిన ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బాలరామకృష్ణ మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తనను, తన భార్యను బలరామకృష్ణ దుర్భాలాడాడని ప్రభాకర్‌రెడ్డి కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదులు తీసుకొని కేసు నమోదు చేశామని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. కాగా, ఇద్దరూ ఒకే పార్టీకి చెందిన వారు కావడం విశేషం.

పరస్పర ఆరోపణలు

తనను చంపేందుకే ప్రభాకర్‌రెడ్డి కారుతో ఢీకొట్టాడని బాలరామకృష్ణ ఆరోపించారు. గతంలో కూడా ఇలాగే చేస్తే మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లానని తెలిపాడు. కాగా తనపై రాజకీయంగా బురద చల్లేందుకే బాలరామకృష్ణ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రోడ్డుకు ఎడమ వైపు కుక్క పిల్లలు ఉండటంతో వాటిని తప్పించబోయి కుడివైపు వస్తున్న బలరామకృష్ణ ద్విచక్ర వాహనాన్ని ప్రమాదవశాత్తు ఢీకొనడం జరిగిందని తెలిపారు. అంతేగానీ ఇందులో ఎలాంటి కుట్ర కోణం లేదన్నారు. కావాలనే బలరామకృష్ణ తనను, తన భార్యను తిట్టాడని జిల్లెల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

స్వల్ప అగ్నిప్రమాదం

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్‌లోని గిఫ్ట్ అండ్ నావల్టీస్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ వల్ల మంగళవారం స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్ సమీపంలో గల ఓ భవనం మొదటి, రెండో అంతస్తుల్లో తిరుమల గిఫ్ట్ అండ్ నావల్టీస్ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. సెకండ్ ఫ్లోర్‌లో ఒక్కసారిగా పొగ రావడంతో సిబ్బంది మలక్‌పేట పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో బొమ్మలు, గిఫ్ట్ ఆర్టికల్స్, టెడ్డీలు, డేకరేషన్స్ కాలిపోయాయి.